

అన్ని వేళలా సావధానతతో
ఎలా ఉండాలి అనేది
అంతముఖ్యం కాదు.
మన పరధ్యాసను గురించి ఎరిగి
ఉండటమే అంతకంటె ముఖ్యం.


# అంతరంగయాత్ర

జె. కృష్ణమూర్తి బోధనలతో కూర్చిన ప్రచురణ

ANTHARANGA YATRA

KRISHNAMURTI FOUNDATION INDIA APRIL 2010 - JULY 2010 Rs.2/- VOL. IV ISSUE 3


## జ్ఞానసంచయం : తెలివి

మీరందరూ అనేకరకాల జ్ఞానం సంపాదించడానికి ఈ రుషీవేలీ స్కూలుకు వచ్చారనుకోవచ్చు. ఇక్కడ వుండే కాలంలో విజ్ఞానశాస్త్రం, గణితం, జీవరసాయనం, భాషాశాస్త్రం, చరిత్ర, భౌగోళిక శాస్త్రాలు అధ్యయనం చేస్తారు. ఇక్కడ మీరు ఆర్జించే జ్ఞానమే కాక సామూహిక జ్ఞానమనేది కూడా ఒకటుంది: అంటే మీ జాతి వారైన మీ పూర్వీకులు, పాతతరాలవారు, మీ తాతముత్తాతలు సేకరించిన జ్ఞానం కూడా మీలో వున్నట్లే. వారంతా ఎన్నో అనుభవాలు పొందివుంటారు. వారి జీవితాల్లో ఎన్నో ఘట్టాలు వుండివుంటై. ఆ మొత్తం అనుభవమంతా ఈ జ్ఞానసంచయంలో భాగమే. ఇదే కాక మీ స్వంత అనుభవాలు, మీకు కలిగే అభిప్రాయాలు జీవితంలో మీరు ప్రతిస్పందించిన తీరు, మీ అభిరుచులు అనేకసందర్భాల్లో మీరు చూపే మొగ్గు, ఇవన్నీ కూడా వాటివాటి విచిత్రరూపాలు ప్రదర్శిస్తూవుంటై.

ఒక వంక ఇప్పుడుడు మీరు సేకరిస్తున్న వైజ్ఞానిక, జీవరసాయనిక, గణిత, చారిత్ర భౌగోళికజ్ఞానం, ఇది కాక మీలో నిబిడీకృతమైన తరతరాలనాటి మీ జాతి సంప్రదాయం, మీ గతానికి చెందిన సాముదాయక విజ్ఞానం, వాటికి తోడు నిత్యజీవితంలో మీ స్వీయానుభవంతో స్వీకరించే జ్ఞానం, అంటే మీరిక్కడ స్కూల్లో గడించే జ్ఞాన సంచయం ఒకటైతే, మీలో భాగమై వున్న జాతిసాముదాయక జ్ఞానం రెండోది. ఈ రెండూకాక, మీ స్వానుభవం ద్వారా పుట్టుకొచ్చే జ్ఞానం మూడోది. అయితే ఇవన్నీ ఏకమై మీలో తెలివిని ప్రజ్వలింప జేయగలిగి వున్నాయా? అనేదే ప్రశ్న.

అసలు ఈ జ్ఞానం అంటే ఏమిటి? ఈ రకమైన జ్ఞానానికీ తెలివికీ సంబంధమున్నదా? తెలివి అనేది ఈ జ్ఞానాన్ని వినియోగించుకుంటుంది అనేమాట నిజమే. తేటతెల్లంగా విశదంగా మానసిక ఆరోగ్యంతో, స్వపర భేదం లేకుండా ఆలోచించగలగడమే తెలివి. ఈ తెలివిలో స్వంత అభిప్రాయంకానీ, ఇష్టాఇష్టాలు కానీ పక్షపాతంకానీ ఏ ఒకవైపు మొగ్గుచూపడం కానీ, ఉండవు. అపరోక్షంగా నేరుగా అర్థం చేసుకోగలిగిన సామర్థ్యమే తెలివి. నే చెప్పే మాటలు అంత సులభగ్రాహ్యంగా కనిపించకపోయినా, ఇది చాలా ముఖ్యమైన విషయమని గుర్తుంచుకోండి. అందుచేత దీనిని అర్థం చేసుకోడానికి మెదడుకు కాస్త పదును పెట్టండి.

☞ 2

## ఎరుక

### మనసు ఏనాడూ స్పృశించని ఒక అపూర్వ స్థితి

ఒకరి **ప్రశ్న:** ఎరుకకు మీరు చెప్పే అర్థం ఏమిటి? తరచు మీరు అంటూ ఉంటారు– మీ బోధన అంతా కూడా నిజంగా ఈ ఎరుకను గురించే అని. మీ ప్రసంగాలను వినీ, మీ పుస్తకాలను చదివీ ఈ ఎరుకను అర్థం చేసుకోవాలని ప్రయత్నించాను కానీ అంత బాగా తెలిసింది అని చెప్పలేను. ఈ ఎరుక సాధన వల్ల వచ్చేది కాదు. ఏ రకమైన సాధనను కాని, పరిశ్రమను, పద్ధతిని, క్రమశిక్షణను కాని, దైనిక సూత్రాలను కాని ఎందుకు మీరు సుతరామూ ఆమోదించరో నేను అర్థం చేసుకున్నాను. దీని ప్రాధాన్యతను నేను చూడగలుగుతున్నాను. లేకపోతే ఇదంతా యాంత్రికంగా తయారవుతుంది. చివరకు మనసు మందకొడిగా, మూర్ఖంగా అయిపోతుంది. మీరు అనుమతిస్తే మీతో పాటుగ నేను ఈ ఎరుకగా వుండటం అంటే ఏమిటి అనే ప్రశ్నను చివరంటా శోధించి చూడాలనుకుంటున్నాను. ఈ మాటకు మీరు ఒక లోతైన విస్తృతమైన అర్థాన్ని ఇస్తున్నట్లుగా కనబడుతున్నది. అయితే మనందరమూ కూడా జరుగుతున్న విషయాల ఎడల ఎప్పుడూ ఎరుకగా వున్నట్లే నాకు కనబడుతున్నది. నేను కోపంగా ఉన్నప్పుడు అది నాకు తెలుస్తుంది. విచారంగా ఉన్నప్పుడు తెలుస్తుంది. సంతోషంగా ఉన్నప్పుడూ నాకు తెలుస్తుంది.

**కృష్ణమూర్తి:** కోపము, విచారము, సంతోషము గురించి నిజంగా మనకు ఎరుక ఉన్నదా అని నా సందేహం. అవి అన్నీ జరిగిపోయాకే వాటి గురించిన ఎరుక, స్పృహ మనలో కలుగుతున్నాయా? ఇప్పుడు వాటన్నింటిని గురించి మనకు బొత్తిగా ఏమీ తెలియదు అన్నట్లుగా మొట్టమొదటి నుండీ ఆరంభిద్దామా? ఏ నిర్ధారణలూ చేయకుండా, పట్టుదలల జోలికి పోకుండా ఈ ప్రశ్నను శోధించి చూద్దాం. నిజంగా చాలా లోతుగా కనుక ఈ విషయాన్ని మనం తరచి చూస్తే అప్పుడు మనసు ఏనాడూ స్పృశించని ఒక అపూర్వ స్థితిని, పైపై ఎరుక చేత స్పృశింపబడని మరో ఆయతన పార్శ్వపు స్థితిని తేటతెల్లం చేస్తుందేమో. పైపైన ఉండే దాని

☞ 3

*(1వ పేజీ తరువాయి) . . .*

# జ్ఞానసంచయం : తెలివి

అటేమో గతానికి సంబంధించిన జ్ఞానసముచ్చయమున్నది. ఎప్పటికప్పుడు దానికి కొత్తది, నూతనంగా కనుగొన్నది, వెల్లికలుస్తుంటుంది. ఇటేమోఈ తెలివి; చాలా సున్నితంగా, చాలా అప్రమత్తంగా, తీక్షణమైన ఎరుకతో వుండే మనసుకు గల గుణమే తెలివి. ఏ విషయానికి విలువకడుతూ కూచోదు. దేనిని గురించి కూడా 'ఇది ఇట్లా, అది అట్లా' అని ముమ్మందే నిర్ధారణ చేయదు. ఏ విషయం గురించైనా స్పష్టంగా తేటతెల్లంగా, స్వపరభేదం పాటించకుండా వస్తుగతంగా ఆలోచించగలిగి వుంటుంది. ఈ తెలివి విషయంలో చిక్కుకొని పోయి వుండదు. స్వేచ్ఛగా ప్రవర్తిస్తుంటుంది. అర్థమవుతున్నదా?

మరి ఈ తెలివి ఏమి చేస్తే లభిస్తుంది? ఈ తెలివికున్న సామర్థ్యమేమిటి? మీకు ఈ స్కూల్లో అనేక విషయాలు నేర్పుతున్నారు. మీరిక్కడ ఎన్నోరకాల విజ్ఞానాన్ని సేకరిస్తూ జీవిస్తున్నారు. మరి ఇక్కడ మీ కందుతున్న పలురకాల జ్ఞానంతో బాటు, నేను చెప్పే ఈ తెలివి కూడా విద్యలో భాగంగా గణపుతున్నారా? నేనే మడుగుతున్నానో మీ కర్థమయిందా? మీకు గణితంలోనూ ఇంజనీరింగ్‌లోనూ మంచి ప్రవేశం వుండవచ్చు, కళాశాలల్లో చేరి పెద్దడిగ్రీలు పొందవచ్చు. ఫస్ట్ క్లాస్ ఇంజనీర్ అవవచ్చుగాక. కానీ అదే సమయాన మీరు సున్నితమైన స్పృహతో, ఎచ్చరికతో, చురుగ్గా రూపొందుతున్నారా అనేది గమనించండి. ఏదైనా విషయాన్ని గురించి ఆలోచించేటప్పుడు వస్తుగతంగా విమర్శగా, తెలివిగా సదవగాహనతో ఆలోచిస్తున్నారా? మీలో ఈ సాధారణ జ్ఞానానికీ తెలివికీ సరియైన పొందికవున్నదా? మీలో ఈ రెండూ వుండదగిన పాళ్లలో వున్నాయో లేదో చూచుకోండి. మనసులో అంతకుమునుపే ఏర్పరుచుకున్న అభిప్రాయాలు, విషయవిచారణ సల్పకుండా చేసుకున్న నిర్ణయాలు గనక కలిగివుంటే, సరిగా ఆలోచించలేరు. అంతేకాదు, చుట్టూవున్న ఈ ప్రకృతి యెడల, మీ చుట్టూ జరుగుతుండే అనేక విషయాలయెడల, బయటి ప్రపంచంలోనే కాక మీ అంతర్‌ప్రపంచం యెడల కూడా మీకు సున్నితత్త్వం, స్పందనశీలత లేని పక్షంలో మీరు తిన్నగా ఆలోచించలేరు. మీలో ఎఱుక లేనట్లయితే, సౌకుమార్యంలోపిస్తే, మీ ఆలోచన సరియైన తీరులో వుండదు. ఈ పుడమితల్లి చక్కదనం, ఈ వృక్షాల అంద చందాలు, అద్భుతమైన ఆ ఆకాశం, ముగ్ధమనోహరమైన ఆ సూర్యాస్తమయం, మిణుకుమిణుకుమంటూ మెరిసే ఆ నక్షత్రాలు, సూక్ష్మాతి సూక్ష్మమైన అగమ్యగోచరమైన దానిలోని సౌందర్యం మొదలైనవన్నీ చూడగలగడమే తెలివి.

ఈ స్కూల్లో మీరీరకమైన తెలివి నార్జిస్తున్నారా? దీనిని సాధిస్తున్నారా, లేక కేవలం పుస్తకాల ద్వారా దక్కేజ్ఞానం మాత్రమే పోగేసుకుంటున్నారా? మీకే గనుక నేచెప్పే ఈ తెలివి, ఈ మృదుత్వం గనక లేకపోతే మీరు సాధించే ఈ జ్ఞానం ప్రమాదరకమైనది సుమా. ఇలాంటి జ్ఞానాన్ని విధ్వంసానికి వినియోగించే వీలున్నది. మీ చుట్టూవున్న లోకం చేస్తున్నదిదే. ఇలా ఎందుకు అవుతున్నది అని ప్రశ్నించి కనుగొనగలిగిన తెలివిమీలో వున్నదా?

ఈ తెలివి మీ చుట్టూ వున్న ప్రకృతి సౌందర్యాన్నంతా ఆస్వాదించగలిగి వుండాలి. అదే సందర్భంలో ఈ మురికీ, దుర్గంధంతో కూడిన పరిసరాలను కూడా గమనించగలిగివుండాలి. బాహ్యాలోకాన్నేకాక మీ అంతర్లోకాన్ని కూడా దర్శించగలిగివుండాలి. లోకంలోని అన్నిటి యెడలా మీరిలా స్పందిస్తున్నారు, మెదడులోని మీ ఆలోచన ఎన్ని వంకర్లు తిరుగుతున్నదీ అన్నింటినీ పరిశీలించాలి. మరి మీరు ఇదంతా చేస్తున్నారా? మీరూ మీ టీచర్లూ కలిసి, ఈ రకమైన తెలివిని ప్రోది చేస్తున్నారా? ఇది జరగని పక్షంలో మీరిక్కడ విద్య నేర్చిన ప్రయోజన మేమిటి?

ప్రప్రథమంగా నన్ను మీరు అన్ని విషయాల్లోనూ ప్రశ్నించాలని ఆశించి వుండేవాణ్ణి అయితే ఆ ప్రశ్నలు సాధారణంగా నేర్పే జ్ఞానసంచయం గురించి కాదు. అదేముంది అది చాలా చిన్న విషయం. అందుకు ఎవరైనా సమాధానం చెప్తారు. నన్ను మీరు వేసే ప్రశ్నలు మరోరకంగా వుండాలని నా ఉద్దేశం. 'చూపు' అనే పదమే తీసుకోండి. అసలు ఆ పదానికి అర్థమేమిటి? ఆ పర్వతాలశ్రేణిని ఎలా చూడాలి, ఆ పక్షిచేసేధ్వనుల నెలావినాలి, ఆ కాలువ నీటి ప్రవాహాన్ని ఎలా గమనించాలి, అనే ప్రశ్నలు వేస్తే ఆనందిస్తాను. అద్భుతమైన ఈ వసుధను, అందమైన ఈ ప్రకృతిని నేల నాలుగుచెరగుల కనిపించే ఈ చక్కదనాన్ని కెంపువన్నెలతో కూడిన ఈ మట్టిని ఎలా వీక్షించాలో నేర్పుతాను. ఆ తర్వాత ఆ రైతుల్నీ, గ్రామస్థుల్నీ చూడమంటాను. ఆ చూడడంలో కూడా దోషమెన్నకుండా చూడడమంటే ఏమిటో నేర్పుతాను. వారు ఎలాంటి మురికివాతావరణంలో, ఎటువంటి దారిద్ర్యంలో జీవిస్తున్నారో గమనించమంటాను. చూడడమంటే, ఇప్పుడు మీరు చూస్తున్నట్లు, అంటే నిర్లక్ష్యంగా, మీకేమీపట్టనట్లు చూడడం కాదు. జాగ్రత్తగా పరిశీలించాలి. అటువాళ్ళ గుడిసెలు కనిపిస్తున్నై. మరెప్పుడైనా ఆ గుడిసెల వద్దకు వెళ్లారా? మీ టీచర్లయినా వెళ్లారా? మీరంతా వెళ్లి చూచేవుంటే, అక్కడి పరిస్థితులు గమనించి వుంటే ఇప్పటికి ఏమిచేశారు? అందువల్ల ప్రథమంగా మిమ్మల్ని అదంతా చూచేటట్లు చేస్తాను. అంటే అక్కడ ఏర్పడిన పరిస్థితి యెడల మీలో ఓ సున్నితమైన స్పృహ కలిగేట్లు చేస్తానన్నమాట. మీ చుట్టూ నెలకొనివున్న స్థితి గతులను పట్టించుకోకపోతే, మీలో సుతిమెత్తని మనసు ఏర్పడదు. అంతటితో అయిపోలేదు. 'మీరు తెలివిగా వుండాలంటే మీరు చేస్తున్నదేమిటో, మీ ప్రతి చర్యా మీకు అర్థం కావాలి' అని కూడా అంటాను. మీరు ఎలా వ్యవహరిస్తుంటారో, ఎలా నడుస్తుంటారో, ఎలా మాట్లాడుతుంటారో, ఆహారమెలా తీసుకుంటుంటారో, అన్నిటినీ గమనిస్తుండాలి. అర్థమయిందా? మీరేమి తింటున్నారో, ఎంత తింటున్నారో, ఎలా తింటారో, ఇవన్నీ కూడా గమనించదగినవే. ప్రతి విషయాన్ని పరీక్షగా చూడండి, చర్చించండి, ప్రశ్నించడానికి సందేహించకండి, కనుక్కోండి, నేర్చుకోండి.

నేనుగనక మీకు క్లాసు తీసుకునేట్లయితే, ఆ పాఠ్యాంశానికి సంబంధించిన విషయాన్నంతా ఆమూలాగ్రంగా చర్చిస్తాను. ఆ విషయాన్ని ఎలా పఠించాలో, దాని సార సంగ్రహాన్ని ఎలా గ్రహించాలో, సావధాన చిత్తంతో గమనించడమంటే ఏమిటో నేర్పుతాను.

నే చెప్పే విషయంమీద మీకు మనసు లగ్నంకాక, కిటికీ బయట కనిపించే దృశ్యాన్ని చూడాలని మీ కనిపిస్తే, అలాగే ఆ దృశ్యాన్నే తిలకించమంటాను. అదంతా సాకల్యంగా చూచిం తర్వాతనే, మళ్లీ అంత ఉత్సాహంగానూ ఆసక్తితోనూ మీ పాఠ్యపుస్తకంవంక చూడమంటాను. ఆ తర్వాత ఏమంటానో తెలుసా? 'ఇంత సేపూ గ్రంథాలతోనూ, అందులోని విషయాల గురించిన చర్చలతోనూ, మిమ్మల్ని తెలివి తేటలతో వ్యవహరించేట్లుగా చేశాను. మరి ఇప్పుడీ లోకంలో స్థిరమైన బుద్ధితో మంచి మానసిక ఆరోగ్యంతో, సగం నిద్రలో మునిగినట్లుకాకుండా, పరిపూర్ణమైన మెళకువతో ఎలా జీవించాలో నేర్పుతాను, వినండి' అని అంటాను.

టీచర్‌కైనా, విద్యగఱపే మరెవరికైనా వున్న కర్తవ్యమదే. కేవలం ఇంత జ్ఞానం, ఇంత సమాచారం నూరి, విద్యార్థుల తలల్లో పోయడం కాదు, విస్తారమైన ఈ జీవితాన్నంతా మీ ముందు

☞6

**"స్వేచ్ఛలోలాగే సంబంధబాంధవ్యాల లోనూ బాధ్యత అనే అర్థం లోపలగా ఉంటూనే ఉంటుంది."**

(*1వ పేజీ తరువాయి*) . . .

## ఎరుక

వద్ద నుండే పని చేయడం ఆరంభించి ముందుకు సాగుదాం.

మనం కనులతో చూస్తాం. గ్రహణేంద్రియాలతో మన చుట్టూరా ఉన్న విషయాలను పరిగ్రాహ్యం చేసుకుంటాం. పూల వన్నెలను, పూవుల పైన వాలిన తేనెపిట్టను, సూర్యకాంతిని, రకరకాల శబ్దస్థాయిలకు చెందిన వేల ధ్వనులలోని హెచ్చుతగ్గులను, చెట్టునీడ లోతును, ఎత్తును, అసలు ఆ చెట్టును తది తరమైన వాటిని ఈ రకంగా గ్రహిస్తుంటాం. ఇదే విధంగా మన దేహాలను గురించి కూడా అనుభావం చెందుతూ ఉంటాం. వివిధ రకాలైన చిన్నవీ పెద్దవీ అయిన ఇంద్రియ సంవేదనలు అందించే పరికరాలు మన దేహాలే. ఈ ఇంద్రియ సంవేదనలు కనుక పైపైన, ఉపరితలపు స్థాయిలోనే ఉంటే సమస్య లేదు. ఏ గడబిడా ఉండదు. ఆ పూవు, ఆ గడ్డి చేమంతి, ఆ గులాబి అక్కడ ఉన్నాయి. అంతే సంగతులు. ఇది బాగుంది, అది బాగు లేదు అని కాని, పోల్చి చూడటం కాని, ఇష్టాయిష్టాలుకాని లేవు. మన ముందు ఏమి ఉన్నదో అది ఉన్నది. అంతే. మానసికంగా మనోరంగపు పక్షాన పాల్గొనడం ఏదీ ఉండదు. ఇదంతా ఉపరితలపు ఇంద్రియ గ్రాహ్యతా, లేక ఇదే ఎరుక అంటారా? స్పష్టంగా తెలుస్తున్నదా? దీనినే నక్షత్రమండలం వరకు, సముద్రాల అగాధాల వరకు విస్తరింపజేయ వచ్చు. ఆధునిక సాంకేతిక పరికరాలను ఉప యోగించి వైజ్ఞానిక పరిశీలన యొక్క పర మావధుల వరకు కూడా తీసుకొని వెళ్ళవచ్చు.

**ప్రశ్నిస్తున్నవారు:** అవునవును. అర్థమైంది.

**కృ:** అందుచేత చూడండీ, గులాబీ పూవూ ఉన్నది, ఈ మహావిశ్వమూ ఉన్నది. ప్రజలున్నారు, మీకు భార్య కనుక ఉంటే ఆమే, ఆ నక్షత్రాలు, మహాసముద్రాలు, పర్వతాలు, సూక్ష్మజీవులు, అణువులు, పరమాణువులు, ఈ గది, ఈ తలుపు, ఇవన్నీ నిజంగానే ఉన్నాయి. ఇక మరో మెట్టుకి వెళదాం. ఈ విషయాలను గురించి మీరు ఏమి అనుకుంటారు, వాటి గురించి ఎలా అనుభూతం చెందుతున్నారు అనేవి వాటి ఎడల మీరు చూపే మానసిక ప్రతిస్పందన. దీనినే మనం ఆలోచన అనో మనోద్వేగం అనో అంటాం. అందుచేత ఉపరితలపు ఎరుక అనేది చాలా సరళమైన సాదాసీదా సంగతి. ఆ తలుపు అక్కడ ఉన్నది. తలుపును గురించిన వర్ణన తలుపు కాదు. తలుపు గురించిన వర్ణనలో పడి మీరు మనోద్వేగం చెందితే కనుక అప్పుడు తలుపును చూడరు. ఈ వర్ణన ఒక మాట అవచ్చు. శాస్త్రబద్ధమైన సిద్ధాంత సూత్రం అవచ్చు. లేదా బలమైన ఉద్వేగ పూరితమైన ప్రతిస్పందనా కావచ్చు. వీటిలో ఏవీ ఆ తలుపుకాదు. ఆరంభంలోనే ఈ సంగతిని మనం బాగా అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. ఇది కనుక సవ్యంగా అర్థంచేసుకోక పోతే మన గందరగోళం ఇంకా ఇంకా ఎక్కువవుతూ పోతుంది. వర్ణన వర్ణించబడిన వస్తువు కాదు. అయితే ఇప్పుడు నేను చేస్తున్నది కూడా ఒక దానిని గురించిన వర్ణనే. అది తప్పదు. నేను చేస్తున్న వర్ణన నేను వర్ణిస్తున్న విషయం అవదు. అందుచేత ప్రసంగం వింటున్నంత సేపూ ఇది దృష్టిలో పెట్టుకోండి. మాటను, ఆ మాట దేనిని వర్ణిస్తున్నదో అదే అని అనుకొని గడబిడలో పడకండి. మాట అసలైన వస్తువు కాదు. ఇక మనం ఎరుక గురించి తరువాత దశలోకి ప్రవేశించినప్పుడు మీరు మరింత అయోమయంలో పడతారు. ఎందుకంటే అప్పుడు ఇది బాగా వ్యక్తిగతంగా అయి, మాట ద్వారా చాలా ఉద్వేగభరితులం అవుతాము.

చెట్టు, పక్షి, తలుపు మొదలైన వాటి ఎడల ఉపరితలపు ఎరుక ఉంటుంది. అంటే పైపైనగా వుండేటటువంటి స్పృహ. వాటి ఎడల మన ప్రతిస్పందన ఉంటుంది. దానినే ఆలోచన, మనోభావం, అనుభావం, ఉద్వేగం అని అంటాము. సరే, ఈ ప్రతిస్పందన గురించిన ఎరుక మనలో వున్నప్పుడు దానిని ఎరుకలో రెండవ లోతు అని అంటే అనవచ్చును. గులాబి పూవు గురించిన ఎరుక ఉన్నది. గులాబికి మనం ఇచ్చిన ప్రతిస్పందన గురించిన ఎరుకా ఉన్నది. గులాబి ఎడల కలిగిన ప్రతిస్పందన యొక్క ఎరుకను గురించిన స్పృహ మనలో తరచు లోపిస్తుంటుంది. యదార్థంగా ఉన్నదేమిటంటే గులాబిని చూస్తున్న ఎరుక, మనలో కలిగిన ప్రతిస్పందనను చూస్తున్న ఎరుక రెండూ ఒక్కటే. అదంతా ఒకటే కదలిక ఒకటే ప్రవాహం. బాహ్యగత ఎరుక, ఆంతరిక ఎరుక విడివిడిగా ఉంటాయనడం తప్పు. ఒక చెట్టు ఎడల దృశ్య స్పృహ (ఎరుక) ఉన్నప్పుడు, మానసికంగా పాల్గొనడం లేనప్పుడు, అప్పుడు ఆ సంబంధంలో విభజన ఉండదు. కానీ చెట్టు ఎడల మానసికమైన ప్రతిస్పందన కలిగినప్పుడు, ఈ ప్రతిస్పందన నిబద్ధతతో వచ్చిన ప్రతిస్పందన. ఇది పాత జ్ఞాపకాల, పాత అనుభవాల ప్రతిస్పందన. ఈ ప్రతిస్పందన సంబంధబాంధవ్యంలో విభజనను తెస్తుంది. ఈ ప్రతిస్పందన అంటేనే సంబంధంలో 'నేను', 'నేను-కానిది' విగా మనం గుర్తించే వాటి జననం. ప్రపంచానికీ మీకూ గల సంబంధంలో ఈ విధంగా మిమ్మల్ని స్థాపించుకుంటున్నారు. ఇలాగే వ్యక్తిని, సమాజాన్ని కూడా మీరు సృష్టిస్తున్నారు. ప్రపంచాన్ని అది ఎలా ఉన్నదో అలా కాకుండా, స్మృతులకు చెందిన 'నేను'తో ఆ ప్రపంచానికి గల వివిధ సంబంధాలతో చూస్తాం. మనం మానసిక జీవి అని అంటున్న ఆ సమస్తానికి ఈ విభజనే ఊపిరి. ఈ విభజన దానిని పెంచి వృద్ధి చేస్తుంటుంది. ఇందులో నుండే పరస్పర వైరుధ్యాలు, విభజనలూ అన్నీ పుట్టుకొస్తుంటాయి. ఇదంతా మీకు బాగా విశదమైందా? గ్రహిస్తున్నారా? చెట్టు గురించిన ఎరుక ఉన్నప్పుడు ఆ చెట్టుకు విలువ కట్టడం అంటూ వుండదు. కాని చెట్టుకు మన ప్రతిస్పందన ఉన్నప్పుడు, చెట్టుకు మన ఇష్టా

☞4

## కాగితం ముక్క

కొద్ది మాసాలకు పూర్వం నేను స్విట్జర్లెండులో ఉండగా ఒక రోజు ఒక మిత్రుడితో కారులో ప్రయాణం చేస్తున్నాను. ఒక చిన్న అమ్మాయి సైకిలు తొక్కుతూ మా కారుకి చాలా ముందు వెళుతూ కనబడింది. హఠాత్తుగా ఆ అమ్మాయి సైకిలు ఆపి రోడ్డు మధ్యకు వెళ్ళింది. ఎందుకా అని నేను ఆశ్చర్యపోయాను. గమనిస్తూ వుండిపోయాను. ఆ అమ్మాయి రోడ్డుమీద పడి ఉన్న ఒక కాగితం ముక్కను భద్రంగా తీసి దగ్గిరలో ఉన్న చెత్త కుండీలో పడేసింది. మళ్ళీ సైకిలు ఎక్కి తొక్కుకుంటూ వెళ్ళిపోయింది. నేను చెప్తున్న విషయంలోని విశేషం ఏమిటో మీకు అర్థమైందా? ఈ పని చేయమని ఆ చిన్న పిల్లకు అక్కడ ఎవ్వరూ చెప్పలేదు. అయితే వీధులు శుభ్రంగా ఉంచాలనే ఒక సున్నిత భావం ఆ అమ్మాయికే ఉండటం వల్ల రోడ్డుమీద పడివున్న ఆ కాగితం ముక్క చూసి వెంటనే తీసి వేసింది. ఊరూ వాడా పరిశుభ్రంగా ఉంచుకోవాలనే ఒక సహజమైన, స్వత:సిద్ధమైన అభిలాష ఇది. మంచి పనులు చేయాలి అని ఉపన్యాసాలు ఇచ్చే వారు ఈ పనిచేయరు. కళ్ళముందు కనబడుతున్న దానిని వారు పట్టించుకోరు. అందుచేత తక్షణమే చేయవలసిన చర్య చేపట్టరు. ఈ అమ్మాయిలో సహజ సిద్ధంగానే ఉన్న ఈ సున్నిత భావాలు పెద్దయ్యాక మాయమవుతాయేమో. స్కూలుకి వెళ్ళి చదవడం, రాయడం నేర్చుకుంటుంది. పాఠాలు పదేపదే చదువుతుంది. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తుంది. కానీ ఈ సున్నిత భావం పోగొట్టుకుంటుందేమో.

*(రాజఘాటులో విద్యార్థులకు ఇచ్చిన ప్రసంగం నుంచి; 27 నవంబరు, 1963)*

(3వ పేజీ తరువాయి) . . .

# ఎరుక

యిష్టాలకు అనుగుణంగా విలువ గడుతుంటాం. అప్పుడు ఆ ఎరుకలో 'నేను', 'నేను–కానిది' అనే విభజన ఏర్పడుతుంది. ఇక్కడ, 'నేను' అంటే పరిశీలిస్తున్న విషయం నుండి విడివడి వుంటుందనమాట. ఈ 'నేను' యే సంబంధ బాంధవ్యాలలో పాత స్మృతుల, పాత అనుభవాల ప్రతిస్పందన. సరే, ఏ తీర్పులు, నిర్ణయాలు చేయకుండా పరిశీలన, ఎరుక ఉండటం సాధ్యమా? ప్రతిస్పందన, ప్రతిచర్యల ఎడల తప్పొప్పుల తీర్పు లేకుండా పరిశీలన ఉండటం సాధ్యమా? ఇలా కనుక ఉంటే విభజన సూత్రాన్నే మనం నిర్మూలించి వేస్తాం. 'నేను', 'నేను–కానిది' అనే విభజన సూత్రాన్ని. చెట్టును చూస్తున్నప్పుడు, మనల్ని మనం చూసుకుంటున్నప్పుడూ రెండు సందర్భాలలోను కూడా.

ప్ర: మీ వెంటే రావడానికి ప్రయత్నిస్తున్నాను. నేను అర్థంచేసుకున్నది సరియేనా కాదా చూద్దాం. చెట్టును గురించిన ఎరుక ఒకటి ఉన్నది. అంతవరకు అర్థమైంది. చెట్టును గురించిన ఒక మానసిక ప్రతిస్పందన ఉన్నది. ఇది కూడా నాకు అర్థమైంది. ఈ మానసిక ప్రతిస్పందన గత స్మృతుల తోను, గత అనుభవాలతోను తయారు చేయబడింది. అది ఇష్టమో అయిష్టమో అయుంటుంది. అది చెట్టు, 'నేను' అనే విభజన. ఆ, ఇదీ నాకు అర్థమైంది, అని అనిపిస్తున్నది.

కృ: చెట్టు అంత స్పష్టంగానూ మీకిది తేటతెల్లమైందా? లేదూ, ఆ వర్ణన మాత్రమే అర్థమైందా? ఒకటి బాగా గుర్తుపెట్టుకోండి. నేను ముందే చెప్పినట్లుగా వర్ణించబడినది వర్ణన అవదు. మీకు లభించినది ఏది?–విషయమా, దాని వర్ణనా?

ప్ర: విషయమే అని అనుకుంటున్నాను.

కృ: అందుచేత, ఈ వాస్తవాన్ని చూడటంలో వర్ణన అని అనబడే 'నేను' లేదనమాట. ఏ వాస్తవాన్ని చూడటంలో నైనా సరే 'నేను' ఉండదు. ఉంటే 'నేను' ఉంటుంది లేదా చూడటం వుంటుంది. రెండూ ఉండటం సాధ్యకాదు. 'నేను' అంటే 'చూడటం–కానిది'. ఈ 'నేను' చూడలేదు. ఎరుకగా ఉండలేదు.

ప్ర: ఇక్కడ ఆగుదామా? ఏదో చాలా దగ్గిర నుంచి స్పృశించినట్లుగా అనిపిస్తున్నది. కానీ అది నా లోపలగా ఇంకి పోవాలి. నేను రేపు మళ్ళీ రావచ్చునా?

ప్ర: మీరు నిన్న చెప్పినది నాకు బాగా అర్థమైందనే అనుకుంటున్నాను. మాటలలో కాదు. నిజంగానే. చెట్టును గురించిన ఎరుక ఉన్నది. చెట్టును గురించిన ఒక నిబద్ధిత ప్రతిస్పందన ఉన్నది. ఈ నిబద్ధిత ప్రతిస్పందనే సంఘర్షణ. ఇది స్మృతి చేత, గత అనుభవాల చేత జరుపబడే చర్య. ఇది ఇష్టమూ, అయిష్టమూ, అపోహ. ఈ అపోహ, అంటే ఏర్పరచుకున్న అభిప్రాయం అనే ఈ ప్రతిస్పందనే 'నేను' లేక తీర్పరి, నిర్ణేత పుట్టుక. ఇంతవరకు నేను అర్థంచేసుకున్నాను. సంబంధ బాంధవ్యాలన్నింటిలోను ఈ 'నేను–నా' అనేది ఉంటుంది. ఇది నాకు బాగా స్పష్టమైంది. సరే. సంబంధ బాంధవ్యాలలో కాకుండా వాటి కవతలగా ఈ 'నేను' ఉంటుందా?

కృ: మన ప్రతిస్పందనలు ఎంత గాఢంగా నిబద్ధతకు లోనై ఉంటున్నాయో చూశారు కదా. సంబంధాలలో కాకుండా వాటికి అవతల 'నేను' ఉంటుందా అని మీరు అడిగితే అది కేవలం ఊహాత్మకమైన, నిరాధారమైన ప్రశ్నే అవుతుంది. అంటే, ఈ నిబద్ధిత ప్రతి స్పందనల నుండి విడిపించుకోనంతవరకు. తెలుస్తున్నదా? అందుచేత మన మొట్టమొదటి ప్రశ్న నిబద్ధిత ప్రతిస్పందనలకు అవతలగా ఈ 'నేను' ఉంటుందా ఉండదా అని కాదు. అసలు ప్రశ్న ఏమిటంటే, మనస్సు–అంటే అందులోనే మన మనోభావాలు, అనుభావాలు అన్నీ ఉన్నాయి– ఈ మనస్సు గతం అనే నిబద్ధత నుండి విముక్తి చెందగలదా? గతం అంటే ఈ 'నేను'. వర్తమానంలో 'నేను–నా' ఉండదు. మనస్సు గతంలో పనిచేస్తున్నంత వరకు ఈ 'నా–నేను' ఉంటూనే ఉంటుంది. మనస్సు అంటేనే ఆ గతం. మనస్సు అంటేనే ఈ 'నా'.

ఇదిగో ఇది మనస్సు, ఇది ఇక్కడ గతము అని అనడం సాధ్యమవదు. ఆ గతం కొద్ది రోజుల క్రితంది అవచ్చు. పదివేల సంవత్సరాల క్రితంది అవచ్చు. అందుచేత మన ప్రశ్న ఏమిటంటే. మనస్సు నిన్న నుండి తనను తాను విముక్తం చేసుకోగలదా?

సరే, ఇందులో అనేక సంగతులు కలిసి చిక్కుబడిపోయి ఉన్నాయి. ఉన్నాయా లేదా? అన్నింటికంటె మొదటిది, ఈ ఉపరితల ఎరుక ఒకటి ఉన్నది. తరువాత, నిబద్ధిత ప్రతిస్పందన ఎడల ఒక ఎరుక ఉన్నది. తరువాత, మనసు అంటే గతం; మనసు అంటే నిబద్ధిత ప్రతిస్పందన అని తెలుసుకున్న ఒక గ్రహింపు ఉన్నది. తరువాత, ఈ మనసు గతం నుండి తనను విడిపించుకొన గలదా అనే ప్రశ్న ఉన్నది. ఇదంతా కూడా ఎరుక అనే ఒకే ఒక ఏకీకృత చర్యే. ఎందుచేతంటే, ఇందులో నిర్ణయాలు, తీర్పులు లేవు. మనసు అంటే గతం అని మనం అన్నప్పుడు ఈ తెలివిడి, ఈ గ్రహింపు వాచ్యాత్మకమైన తీర్మానం–మాటలలో తీర్పు వంటిది కాదు. వాస్తవం అంటే ఏమిటో దానిని నిజంగా చూసిన గ్రహింపు ఇది.

(తక్కినది వచ్చే సంచికలో)

# నారింజ తోటల లోయ

ప్రతి ఒక్క ప్రాణికి దానిదైన ఒక సున్నితత్త్వం ఉంటుంది. తన స్వంత జీవన రీతి ఉంటుంది. తనకో చైతన్యమూ ఉంటుంది. అయితే మానవుడు తనదే మహోత్తమమైన చైతన్యం అని గొప్పగా చెప్పకుంటాడు. దానితో అతడి లోని ప్రేమ, అతడి హుందాతనము అంతరించి పోతాయి. మోటుతనం, నిర్లక్ష్యం పెరిగి, విధ్వంసకారి అవుతాడు. కమలా ఫలాల తోటలతో నిండిన ఆ లోయ పళ్ళతో, వసంత ఋతువులో పూచిన పూలతో ఆహ్లాదకరంగా ఉన్నది. మబ్బులు లేని ఆ ఉదయాకాశం నిర్మలంగా ఉన్నది.

ఉత్తరాన పర్వతాల మీద సన్నని మంచు జల్లుపడింది. నున్నగా, కఠినంగా కనబడే ఆ పర్వత శిలలు ఎవ్వరితో సంబంధం లేనట్లు ఏకాంతంగా ఉంటాయి. అయితే ఆ ప్రత్యూష వేళ మాత్రం లేత నీలాకాశానికి ఆ పర్వతాలు మహా సన్నిహితంగా ఉన్నట్లుండి, మనం చేయి జాపితే అందేటంత దగ్గిరకు వచ్చేసినట్లు అనిపించింది.

వాటి వయసు అనేక యుగాలు. వాటి ఠీవి అక్షయము, అచంచలమూ. కాలానికి అతీతమైన శోభతో విలసిల్లే సౌందర్యం వాటిది.

ఆ ఉదయం ఎటు చూసినా పరమ నిశ్చలత. నారింజ పూవుల పరిమళంతో వాతావరణం గుబాళిస్తున్నది. కాంతి తన కిరణాలతో పలు వింతలను, ఇంపు సొంపులను పంచుతున్నది. ఈ భూభాగం మీద పడే కాంతిలో ఒక విశిష్టత ఉన్నది. ప్రాణంతో తొణికిసలాడుతూ చొచ్చుకొని వచ్చి కనులను నింపి వేస్తుంది. మన సమస్త చేతనావర్తాన్ని ఆక్రమిస్తుంది. మూలమూలల్లో ఉన్న చీకట్లను పారద్రోలుతుంది. ఈ కాంతిలో ఎనలేని ఆనందమున్నది. ప్రతి ఆకూ ప్రతిగడ్డిపోచా సంతోషంలో తలమునకలవుతున్నాయి. నీలిపిట్ట ఒకటి కొమ్మల మీద గెంతు లేస్తూ తిరుగుతున్నది. గొంతు చించుకొని కీచుకీచుమంటూ అరిచే అరుపులు ఎందుకనో మానేసింది.

వెలుగులు నింపుకున్న ఆ మనోహరమైన ఉదయంలో అగాధ గంభీరత కూడా ఉన్నది.

(కృష్ణమూర్తి జర్నల్ నుండి; 24 ఏప్రిల్ 1975; పుట 99)

# మనల్ని మనం అవగాహన చేసుకోనంత వరకు చీకట్లో కూర్చుని ఉన్నట్లే

ఒకరి ప్రశ్న: నాకు ఆత్మహత్య చేసుకోవాలని అనిపిస్తున్నది. నా జీవితానికి ఒక ప్రయోజనమంటూ వున్నట్లు కనబడటం లేదు. బొత్తిగా అర్థవిహీనంగా ఉన్నది. ఎటు తిరిగి చూసినా నిరాశానిస్పృహలు, బాధలు, ద్వేషాలే నాకు కనబడుతున్నాయి. ఇటువంటి నికృష్ట ప్రపంచంలో నేను ఇంకా ఎందుకు బ్రతికి ఉండాలి?

**కృష్ణమూర్తి:** ఎందుకని ఆత్మహత్యలు చేసుకుంటారు? ఆత్మహత్య చేసుకునేందుకు రకరకాల పద్ధతులు కూడా ఉన్నాయి కదూ? మీ దేశంతో మీరు తాదాత్మ్యం చెందినప్పుడు దేశం కోసం ఆత్మహత్య చేసుకుంటారు కదూ? ఒక రాజకీయ పార్టీలోనో, ఒక మతశాఖలోనో సభ్యుల యినప్పుడు కూడా ఆత్మహత్య చేసుకుంటారు కదూ? ఏదైనా ఒక దానిలో నమ్మకం పాతుకొని పోయినప్పుడు కూడా ఆత్మహత్య చేసుకుంటారు, అవునా? అంటే ఏమిటంటే, మీ కంటె గొప్పదైన దానికి మిమ్మల్ని అర్పించుకుంటారు. మీరు ఏదయివుంటే బాగుండునని అభిలషిస్తారో దానినే చాలా గొప్పది అని మీరు చిత్రించుకుంటారు. మీకంటె గొప్పదైన దానితో-ఈ గొప్పతనం అంటే మహోన్నతమైన దాని కోసం మీ కాంక్ష-దానితో మిమ్మల్ని మమైకం చేసుకోవడము అంటే అదీ ఒక రకమైన ఆత్మహత్యే. సర్, చెప్పున్నది వినండి. పూర్తిగా వినకుండానే త్రోసి పారేయకండి. మీలో చాలామంది మీ దేశంతో కలిసిపోయి తాదాత్మ్యం చెందుతారు. జైళ్ళకు వెళ్ళారు. పోరాటం చేశారు. చాలా చిన్న విషయాలకోసం మీరు ఆత్మహత్య చేసుకున్నారు కదూ! మరొకరు నమ్మకం లేదు కాబట్టి, నమ్మకం పోయింది కాబట్టి ఆత్మహత్య చేసుకుంటారు. అతడో నిరాశావాది. బుద్ధి, మేధలే ప్రధానంగా నడిచిన అతడి జీవితమంతా కలసి ఈతడికి నిరాశను, నిస్పృహను, వేదనను ప్రసాదించింది. అందుచేత అతడు ఆత్మహత్య చేసుకుంటాడు. నమ్మకం ఉన్నవాడు, నమ్మకం లేనివాడు ఇద్దరూ తమ తమ పద్ధతిలో ఆత్మహత్య చేసుకుంటారు. ఎందుకంటే, తమ నుంచి తాము తప్పించుకొని పారిపోవాలనుకున్నారు కాబట్టి. దేశం పేరు చెప్పుకొనో, జాతీయతత్వమనో, దేవుడి పేరు చెప్పుకొనో తప్పించుకొని పోవాలనుకుంటారు. దేవుడు, జాతీయ వాదము నిష్ప్రయోజన మని తేలినప్పుడు, ఏ ఆదర్శం కోసం దేశం నిలబడిందో ఆ ఆదర్శమూ దేశమూ కూడా పరాజయం పొందినప్పుడు వారిలో అంధకారం చోటు చేసుకుంటుంది. మీరు కాని, నేను కాని ఒక మిత్రుడి మీద ఆధారపడి నప్పుడు, మనం ప్రేమించే ఒక వ్యక్తి మీద ఆధారపడి నప్పుడు, ఆ ఆసరా మనకు దూరమైతే, అంతమైపోతే మనం హతాశుల మవుతాం. మనల్ని అంధ కారంలో ముంచి వేసుకుంటాం. ఏదో ఒక గొప్ప విషయంతో మనందరం కూడా మమైకం చెందుతుంటాం. నమ్మకం పేరు తోనో, రకరకాల పలాయనాల పేరు చెప్పుకునో మన నుంచి మనవే తప్పించుకొని పారిపోవాలని ప్రయత్నిస్తాం. మనల్ని మనమే ముఖాముఖిగా చూసుకోవలసి వస్తే అయోమయంలో పడతాం. ఒంటరిగా అనిపిస్తుంది. నిస్పృహలో మునిగి పోతాం. అందుకని ఆత్మహత్య చేసుకోవడానికి సిద్ధపడతాం. ఇదీ మన పరిస్థితి. అవునా కాదా? మీరు ప్రేమిస్తున్న వ్యక్తి విముఖుడై మరోవైపుగా వెళ్ళిపోతాడు. మీకు అసూయ కలుగుతుంది. ఇది మీ మనోహృదయాల్లోని ఖాళీతనాన్ని తెలుపు తుంది. ఆ ఖాళీతనం మిమ్మల్ని భయపెడుతుంది. దానితో మీరు మరో రకమైన పలాయనంలోకి తప్పించుకొని పోవడానికి సిద్ధపడతారు. ఇలా ఎన్నో.

మనల్ని మనం అవగాహన చేసుకోనంత వరకు చీకట్లో కూర్చుని ఉన్నట్లే. ప్రపంచం మహాభయానకం అనీ, బాధల మయం అనీ అంటాం. కానీ ఈ ప్రపంచాన్ని తయారు చేసు కున్నదీ మనమే. ప్రపంచం అంటే మనకు ఒకరితో ఒకరికి గల పరస్పర సంబంధం. ఈ సంబంధబాంధవ్యంలో కనుక పరాధీనత ఉంటే అప్పుడు భయం ఉంటుంది. ఆశాభంగం ఉంటుంది. నిరాశ, నిరుత్సాహం ఉంటాయి. వీటి వల్ల ఆత్మహత్య చేసుకోవాలనే కోరిక పుడుతుంది. మీకు కనుక గాఢమైన విశ్వాసం ఉంటే అదే మిమ్మల్ని నిలబెడుతుంది. అయితే ఆ విశ్వాసమే మీ మనసును నిబద్ధం చేసివేస్తుంది. ఆంతరిక శోధన వైపు మీరు పోనే పోరు. ఈ విశ్వాసమే మీనుండి మీరు పారిపోయే మార్గంగా తయారవుతుంది. మీలో మతాత్మకత ఎంత ఎక్కువగా ఉంటే ఆత్మహత్య వైపుగా ప్రోద్బలం అంత తక్కువగా ఉంటుంది.

మీలో ప్రశ్నించడం ఎక్కువైన కొద్దీ పరిశోధన, అన్వేషణ ఎక్కువవుతాయి. అత్యంత రహస్యంగా దాగి ఉండే ఒంటరితనం అనే ఆ ఖాళీ గురించి తెలిసిపోతుందనే నిరంతర భయం వెంటాడుతునే ఉంటుంది. అందుచేత, దేని మీదా ఆధార పడకుండా ఆ ఖాళీని ముఖాముఖిగా మీరు ఎదుర్కోవాలి కదూ? మీరు పూర్తిగా ఒంటరిగా ఉన్నప్పుడు, ఆ స్థితిలోకి ప్రవేశించి, ఆ స్థితిని అర్థం చేసుకోవాలి, కదూ? ఒంటరిగా ఉండేదీ, ఏ కల్మషాలూ అంటనిదీ, ఆలోచించి తీసుకొని వచ్చినది కానిదీ అయినటువంటి దానిని కని పెట్టడం కోసం మీరు ఒంటరిగా ఉండవద్దూ? మీ ఒంటరితనం గురించి కనుక భయపడుతుంటే మీరా ఏకాంతతను చేరలేరు. మనలో చాలా మందికి మనల్ని మనం ముఖాముఖిగా చూసుకోవడం అంటే భయం. ఆ కారణంగా ఎన్నో పలాయన మార్గాలను ఎంచుకుంటాం. ఈ పలాయన మార్గాల వలన ఫలితం లేకపోతే మనల్ని మనమే సూటిగా చూసుకోవలసి వస్తుంది. ఆ క్షణాన్నే మనం పరికించి చూడాలి. మన లోకి మనం చూసుకోవాలి. ఈ ఖాళీతనాన్ని అర్థంచేసుకోవాలి. అంతే తప్ప, పూజా కర్మల ద్వారా, రకరకాల వ్యాపకాలు, విజ్ఞానం, విశ్వాసం పట్టుకొనడం ద్వారా ఈ ఖాళీతనాన్నుంచి తప్పించుకొని పోకూడదు.

మనసు పూర్తిగా అందులో నిమగ్నమైనప్పుడు మాత్రమే ఆ ఖాళీతనాన్ని మీరు చూడగలుగుతారు. ఆ ఖాళీతనానికి మరో అర్థం ఇవ్వాలనే భావం కాని, దానిని మార్చాలని కోరుకునే భావం కాని లేకుండా దానిని తెలుసుకోవాలి. ఇది చాలా కష్టసాధ్యమైన ప్రక్రియ. మనలో చాలామందికి సోమరితనం. అందుచేత ఏదో ఒక నమ్మకంలో నైనా పడిపోతాం, ఆత్మహత్యయినా చేసుకుంటాం. కాబట్టి ఒంటరితనం అంటే ఏమిటో అర్థం చేసు కున్నప్పుడే, ఒంటరితనంలో ఉండి అనుభవించి నప్పుడే ఆ మనిషి నిష్కల్మషుడై, స్వచ్ఛత చేకూరి ఒంటరిగా ఉండగలుగుతాడు. ఆ ఒంటరితనంలో మాత్రమే 'అస్తిత్వజీవి' అయినది, ఎదురు పడుతుంది. దానిలో ప్రయాసాప్రయత్నాలు, పరస్పర వైరుధ్యాలు, గందరగోళాలతో నిండి పోయిన 'నా, నేను' ఉండదు.

*(బొంబాయిలో ప్రసంగం నుండి; 1953)*

**మీ చిరునామా మాకు వ్రాయండి. 'అంతరంగ యాత్ర'ను ఉచితంగా పంపుతాము.**

(*2వ పేజీ తరువాయి*) . . .

# జ్ఞానసంచయం : తెలివి

ఆవిష్కరించాలి. ఈ జీవితంలో తటస్థపడే అందం, వికారం, సంతోషం, ఆనందం, భయం, బాధ అన్నిటినీ కూడ, టీచర్ మీకు చూపించగలిగి వుండాలి. అంతే గానీ, మీకింత జ్ఞాన సంచయాన్ని అందించడంతో తన కర్తవ్యం పూర్తయిందనుకోకూడదు.

టీచర్లూ, విద్యావేత్తలూ, సంపూర్ణమైన జీవితాన్ని ఈ విధంగా మీచేత దర్శింపజేయగలిగితే, మీరు ఈ స్కూలు వదలి వెళ్లిన తర్వాత కూడా జీవితంలో ఎప్పుడూ అనాలోచితంగా, వినాశకరంగా, నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించరు; ఇక్కడ ఈ స్కూల్లో సాధించిన తెలివిని, మృదుత్వాన్ని జీవితంలో సద్వినియోగం చేసుకోగలిగిన మహావ్యక్తులయే వీలుంది.

ఇప్పుడు నేనిక్కడ మాట్లాడిన దంతా మీరు విన్నారు; ఇక్కడి టీచర్లూ ప్రిన్సిపల్ కూడా విన్నారు. మీరందరూ ఇందు గురించి ఏమి చేయదలుచుకున్నారు? ఈ బాధ్యత యావత్తూ టీచర్లు చూసుకుంటారులే అని సరిపెట్టుకునేరు సుమా. విద్యార్థులుగా మీ బాధ్యత తక్కువయినదేమీ కాదు. విద్యార్థిగా మీ కర్తవ్యమేమిటంటే, ఈ విషయాలన్నింటిని గురించి మీ టీచర్లను అడగాలి, ప్రశ్నించాలి, సందేహనివృత్తి చేసుకోడానికి ప్రయత్నించాలి; అంతేగానీ, 'నేనిక్కడ కూచుంటాను. మీరు నేర్పదలుచుకున్నదేదో నేర్పి పొండి' అనే వీలులేదు. దీనంతటి సారాంశ మేమంటే, మీరు ఎంతో తెలివిగా, మృదువుగా సజీవంగా, దురభిప్రాయాలకు లోనుగాకుండా మెలగవలసి వుంటుందని చెప్పడమే. మీరు చదువుముగించుకొని ఈ స్కూలు వదలి వెళ్లేటప్పుడు దరహాసవదనంతో, ఉప్పొంగే హృదయంతో జీవితంలో అడుగిడగలిగివుండాలి. జీవనరంగంలో ఎదురయ్యే ఘట్టాలకు సందర్భోచితంగా ఆనందంతోనూ, విచారంతోనూ స్పందించగలిగిన తెలివి, మృదుస్వభావం గల మనిషిగా మిమ్మల్ని రూపొందించడం మీ టీచర్ల బాధ్యత.

**వి:** మనిషి మరీ మృదుస్వభావి అయితే ఏదో రకమైన మనోద్వేగానికి గురవుతాడేమోనండీ?

**కృ:** మనిషి రాగభావంతో, ఉద్వేగానికి గురవడం తప్పా? అదుగో అక్కడ ఆ పేదల దారిద్ర్యాన్ని చూచినపుడు, నేను చాలా గాఢంగా బాధపడతాను. అది నా హృదయాన్ని కలచి వేస్తుంది. తప్పంటారా? మీ చుట్టూ అలముకొని వున్న మురికి, దుర్గంధం, దారిద్ర్యాన్ని చూసి ఉద్వేగం చెందడంలో తప్పేమీ లేదు.

మరి మిమ్మల్ని గురించి ఎవరైనా చెడ్డగా అంటే చాలా బాధపడతారే? అప్పుడేమి చేస్తారు? హృదయం గాయపడ్డది కాబట్టి, ప్రతీకారం చేయబూనుకుంటారా? లేక ఒక క్షణం తమాయించుకుంటారా? భావోద్వేగానికి గురయినవారు, ఆక్షణాన తాను ప్రతీకారం చేయబూనుకున్నట్లు గ్రహిస్తారు. సున్నితంగా గమనిస్తున్న ఆ క్షణంలోనే తెలివిప్రవేశిస్తుంది. జరిగిన దానికి ప్రతిక్రియ తల పెట్టేముందు, ఆ రెంటిమధ్యా విరామసమయం, ఉండేట్లు జాగ్రత్త పడండి. ఆ తృటి కాలంలో ఆ ఘట్టాన్ని శ్రద్ధగా గమనించండి. ఆ సమయాన మీకా సమస్యను గురించి బ్రహ్మాండమైన ఎఱుక గనక కలిగితే ఆ క్షణంలోనే చర్య జరుగుతుంది. తెలివినుండి పుట్టుకొచ్చే ఆ తక్షణ చర్య సరియైనదే అవుతుంది; అది సవ్యమైనదే అవుతుంది.

**వి:** మేమిలా నిబద్ధీకరింపబడివుంటానికి, కారణమేమిటంటారు?

**కృ:** మనకిటువంటి నిబద్ధీకరణ ఎందుకు ప్రాప్తించిందంటారా? సులభంగానే కనుక్కోవచ్చు. ప్రశ్నవేశారు కదా? ఇక ఇప్పుడు మీ మెదడుకు పనిపెట్టండి. ఈ నిబద్ధీకరణకు ఎందుకు లోనయ్యారో స్వయంగా కనుక్కోండి. పుట్టడం ఈ దేశంలో పుట్టారు; ఈ సంస్కృతిలో, ఇక్కడి పరిస్థితుల్లో జీవిస్తుంటారు; బాల్యం గడుస్తుంటుంది. అప్పుడు ఏమవుతుందో ఆలోచించండి. హిందువులైనా ముస్లిములైనా, కమ్యూనిస్టులైనా కాపిటలిస్టులైనా, వారివారి మతవిశ్వాసాలు, సిద్ధాంతాల ననుసరించి 'ఇది చెయ్, అది చేయొద్దు' అని చెప్తూ వుంటారు. అమ్మమ్మ ఆలయానికి వెళ్తుండడం అక్కడ ఏదో పూజాపునస్కారాలు చేస్తూవుండడం ఈ బాలుడు గమనిస్తూవుంటాడు; ఆ విధానమంతా ఈ పిల్లవాడి మనసుకు హత్తుకుంటుంది.

(*తక్కినది వచ్చే సంచికలో*)


**Statement about ownership and other particulars of Antharanga Yatra**

**FORM-IV**

| | | |
|---|---|---|
| 1. Place of publication | : | Krishnamurti Foundation India, Vasanta Vihar, 124, 126 Greenways Road, Chennai - 600 028. |
| 2. Periodicity of publication | : | Once in four months (August, December & April) |
| 3. Printer's Name | : | N. Subramanian |
| Whether Citizen of India | : | Yes |
| Address | : | Sudarsan Graphics Offset Press, 27, Neelakanta Metha Street, T. Nagar, Chennai - 600 017. |
| 4. Publishers Name | : | G. Rajeev |
| Whether citizen of India | : | Yes |
| Address | : | Krishnamurti Foundation India, Vasanta Vihar, 124,126 Greenways Road, Chennai - 600 028. |
| 5. Editors Name | : | K. Krishnamurthy |
| Address | : | Krishnamurti Foundation India, Vasanta Vihar, 124, 126 Greenways Road, Chennai - 600 028 |
| 6. Name and address of the individuals who own the newspaper and partners of shareholders holding more than one percent of the total capital. | : | Krishnamurti Foundation India, Vasanta Vihar, 124, 126 Greenways Road, Chennai - 600 028 |

I, G. Rajeev hereby declare that the particulars given are true to the best of my knowledge and belief.

Sd.
(G. Rajeev)

*Published in August, December & April*

Periodical

*Registered with The Registrar of Newspapers for India under No. TNTEL/2006/19442*



*If undeliverd please return to:*
KRISHNAMURTI FOUNDATION INDIA
Vasanta Vihar, 124, 126 (Old No. 64, 65) Greenways Road
Chennai - 600 028. Tel: 24937803/24937596
E-mail: publications@kfionline.org
Websites: www.kfionline.org/www.jkrishnamurti.org


*Published by G. Rajeev on behalf of the Krishnamurti Foundation India, Vasanta Vihar, 124, 126 (Old No. 64, 65)Greenways Road, Chennai - 600 028. Printed by N. Subramanian at Sudarsan Graphics Offset Press, 27 Neelakanta Mehta Street, T. Nagar, Chennai - 600 017. Editor : K. Krishnamurthy*